క్లుప్తంగా

నేడు సెమినార్

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : వ్యవసాయ సంక్షోభం పరిష్కార మార్గాలపై ఆదివారం సెమినార్ నిర్వహించనున్నట్లు ఏపీ రైతు సంఘం కడప జిల్లా ప్రధాన కార్యదర్శి బి దస్తగిరి రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. వైఎస్సార్, అన్నమయ్య జిల్లా కమిటీల ఆధ్వర్యంలో కడప పాత బస్టాండ్ వద్దగల సీఐటీయూ జిల్లా కార్యాలయంలో ఈ సెమినార్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సెమినార్‌లో రైతాంగ సమస్యలు, వ్యవసాయ సంక్షోభం, మద్దతు ధర, రైతాంగం పట్ల పాలకుల విధానాలు తదితర అంశాలపై చర్చించడం జరుగుతుందన్నారు. జిల్లాలోని రైతు సోదరులు పాల్గొని జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

ఘన సన్మానం



ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలను సన్మానిస్తున్న ఎస్టీయూ నాయకులు

కడప ఎడ్యుకేషన్ : ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్న ఉపాధ్యాయులను శనివారం ఎస్టీయూ నగరశాఖ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కడపలోని ఎస్టీయూ భవన్‌లో జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్న కడప పట్టణంలో ఎస్‌జీటీగా పనిచేస్తున్న జరీనాభానో, యాస్మిన్‌బేగమ్, నజీముల్లా, సాధిక్ ఆలీ, మైదుకూరు మండలంలో స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న మునెయ్య, బద్వేల్ మండలంలో ఎస్‌జీటీగా పనిచేస్తున్న థామస్‌ను శాలువ, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఎస్టీయూ రాష్ట్ర కార్యదర్శి ఎస్ఎండీ ఇలియాష్‌బాష, ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు రమణారెడ్డి, ప్రధాన కార్యదర్శి వెంకట సుబ్బయ్య పాల్గొన్నారు.

ధ్యానం ద్వారా ఏకాగ్రత

కడప కోటిరెడ్డిసర్కిల్ : ప్రతి ఒక్కరూ క్రమం తప్పకుండా కొంత సమయాన్ని కేటాయించి ధ్యానం చేస్తే తాము చేస్తున్న పనిపై ఏకాగ్రత పెరుగుతుందని బ్రహ్మకుమారీ ఈశ్వరియా విశ్వ విద్యాలయం అక్కయ్యలు తెలిపారు. శనివారం వారు నిహార్ మల్టీ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌కు విచ్చేశారు. ఈసందర్భంగా వారు విద్యార్థులతో మాట్లాడుతూ ఆర్ట్ ఆఫ్ పాజిటివ్ థింకింగ్ గురించి వివరించారు. మనసులో ఏకాగ్రత పెంచుకోవడానికి ధ్యానం ఉపయోగపడుతుందన్నారు. మనం ఎలాంటి సంకల్పం చేస్తామో అలానే మారుతామనే ఫార్ములాను గుర్తించుకుని ప్రతిరోజు ఉదయం కొంత సమయాన్ని కేటాయించి మనసులో ప్రస్తుతానికి, భవిష్యత్తు కోసం ఆలోచించాలన్నారు. అనంతరం ప్రాక్టికల్‌గా ధ్యానం చేసే విధానాన్ని వివరించారు.

పునీత్ సాగర్ అభియాన్‌లో ఎన్‌సీసీ కేడెట్స్

వైవీయూ : కడప నగరంలోని ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ఎన్‌సీసీ యూనిట్ ఆధ్వర్యంలో జీ-20 సమ్మిట్ సందర్భంగా పునీత్ సాగర్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ప్రముఖ పుణ్యక్షేత్రమైన పుష్పగిరి వద్దనున్న పెన్నానది పరిసరాలను ఎన్‌సీసీ కేడెట్స్ శుభ్రపరిచారు. నదీ పరిసరాల్లో చెత్తాచెదారాన్ని ఎత్తివేసి శుభ్రం చేశారు. ఎన్‌సీసీ కేర్ టేకర్ విన్నీతేజ పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాటం

కడప కోటిరెడ్డిసర్కిల్ : ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాటాలు నిర్వహించి వారికి న్యాయం జరిగేలా చూస్తామని భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షుడు వంగల శశిభూషణ్‌రెడ్డి తెలిపారు. శనివారం స్థానిక వైఎస్సార్ మెమోరియల్ ప్రెస్ క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో తాను రెండుమార్లు జిల్లా అధ్యక్షుడిగా పనిచేశానని, ఆ అనుభవంతో రానున్న ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని మూడవసారి జిల్లా అధ్యక్షుడిగా నియమించారన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మాజీ అధ్యక్షులు శ్రీకాంత్‌రెడ్డి, నాయకులు బత్తల పవన్‌కుమార్ పాల్గొన్నారు.

నేడు ఆత్మీయ సమావేశం

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప నగరంలోని శ్రీ శారదా నిలయం హైస్కూలు పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమావేశం ఆదివారం నిర్వహించనున్నట్లు కార్యక్రమ నిర్వాహకులైన పూర్వ విద్యార్థులు తెలిపారు. పాఠశాలలో 1984-85 సంవత్సరంలో పదవ తరగతి చదువుకున్న విద్యార్థులు నగరంలోని వైఎస్సార్ మెమోరియల్ ప్రెస్ క్లబ్‌లో సమావేశం కానున్నారన్నారు. ప్రతి ఒక్కరూ ఆత్మీయ సమావేశానికి హాజరు కావాలని వారు కోరారు.

ఘనంగా దత్తాత్రేయస్వామి విగ్రహ ప్రతిష్ట

పెండ్లిమర్రి: మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయం ఆవరణలో శనివారం తహశీల్దార్ ఉదయబాస్కర్ రాజు ఆధ్వర్యంలో వెయ్యినూతలకోన దేవస్థానం ఆలయ ధర్మకర్త నరసింహ హరిప్రసాద్, వేదపండితుల సమక్షంలో ఘనంగా దత్తాత్రేయస్వామి నూతన విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం చేపట్టారు. ముందుగా వేదపండితులు హోమం, ఆకుపూజ,గణపతిపూజ, ప్రత్యేక పూజలు, చేపట్టి అనంతరం విగ్రహ ప్రతిష్ఠ చేపట్టారు. అనంతరం స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. జెడ్పీ వైస్ ఛైర్మన్ బాలయ్య, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చంద్రారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి శివశంకర్‌రెడ్డి, వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు రమణారెడ్డి,ఎస్ఐ సునీల్ కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.



రాష్ట్రంలో 2015లో జరిగిన స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలో సీఐడీ పోలీసులు మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును అరెస్టు చేయడంపై సాధారణ ప్రజలు స్పందించారు. నేరానికి పాల్పడిన వారు ఎంతటి వారైనా.. ఏదో ఒక రోజు శిక్ష అనుభవించక తప్పదని, అదే పరిస్థితి ప్రస్తుతం చంద్రబాబుకు ఎదురైందని పేర్కొంటున్నారు. చంద్రబాబు అరెస్టు నేపథ్యంలో వివిధ వర్గాల ప్రజల అభిప్రాయాలు ఇలా..

– సాక్షి నెట్‌వర్క్

చట్టానికి ఎవరూ అతీతులు కారు..



చట్టానికి ఎంతటి వారైనా అతీతులు కారు. తప్పుచేస్తే దర్యాప్తు సంస్థలు అరెస్టు చేయడం సర్వసాధారణం. తప్పు చేయలేదనుకుంటే నిరూపించుకుని సచ్ఛీలురుగా ముందుకు రావాలి. దీన్ని రాజకీయం చేయడం సరికాదు.

- పుల్లగూర శ్రీనివాసులు, అధ్యక్షుడు, నేచర్‌లింక్ సోషల్ సర్వీస్ సేవాసంస్థ, కడప

తప్పు చేస్తే శిక్ష తప్పదు



ప్రజాధనం దుర్వినియోగం చేస్తే ఎంతటివారికైనా శిక్ష తప్పదు. టీడీపీ అధినేత చంద్రబాబు తప్పు చేయనపుడు అరెస్టులకు భయపడటం సరికాదు. చట్టం దృష్టిలో ఎవరూ అతీతులు కారు. సీఐడీ అధికారులు ఆధారాలు ఉన్నాయి కాబట్టే చంద్రబాబును అరెస్ట్ చేశారు.

- ఎం.మస్తాన్‌రెడ్డి, పాములూరు, వేంపల్లె మండలం

సమయం వచ్చింది.. అరెస్టు చేశారు



పిల్లి కళ్లు మూసుకుని పాలు తాగి తననెవరూ చూడలేదనుకున్నట్లు ఉంది చంద్రబాబు నాయుడు పరిస్థితి. అధికారం చేతిలో ఉన్నప్పుడు తప్పులు చేసి.. నాలుగేళ్లయినా అవి బయట పడలేదులే.. అని భీకరిస్తే ఎలా? ఇపుడు టైమ్ వచ్చింది.. తప్పులు ఆధారాలతో సహా బయటపడ్డాయి. చట్టం తన పని తాను చేసుకుపోతూ ఉంది. సామాన్య మానవుడైనా, రాష్ట్రానికి నాయకుడైనా చట్టం ముందు అందరూ సమానులే. చంద్రబాబు అరెస్టు రాజకీయ నాయకులకు ఒక కనువిప్పుగా మారాలి.

- వెంపలాకు మహాలక్ష్మి, వద్దిరాల, వైఎస్సార్ జిల్లా

దర్యాప్తు సంస్థలను అడ్డుకోవడం సరికాదు..



చట్టం పని తను చేసుకునే సమయంలో దర్యాప్తు సంస్థలను అడ్డుకోవడం సరికాదు. ప్రజాప్రతినిధులుగా ఏళ్లపాటు చేసినవారు సైతం అధికారులకు సహకరించకపోవడం సబబుకాదు.

- జె.ఖాదర్‌బాషా, కడప

ఊరకే ఎవరూ అరెస్ట్ చేయరు కదా..!



చంద్రబాబు తాను అధికారంలో ఉన్నప్పుడు వ్యవస్థలను మేనేజ్ చేసి వేలకోట్లు దుర్వినియోగం చేశారు. ఎంత అవినీతికి పాల్పడినా ఆధారాలు దొరక్కుండా జాగ్రత్త పడ్డారు. స్కిల్ డెవెలప్‌మెంట్ శాఖలో జరిగిన అవినీతిలో బాబు అడ్డంగా దొరికిపోయారు. అన్ని ఆధారాలు పక్కాగా ఉన్నాయి కాబట్టే అధికారులు చంద్రబాబును అరెస్ట్ చేశారు. చట్టం తనపని తాను చేసుకుపోయింది.

- మోషే, వ్యాపారస్తుడు, కడప నగరం

అపుడే అరెస్టు చేయాల్సింది!



ఎస్సీలుగా ఎవరైనా పుట్టాలని కోరుకుంటారా అని చంద్రబాబు దళితులను కించపరిచినప్పుడే కేసు నమోదు చేసి అరెస్టు చేసి ఉండాల్సింది. అయితే అప్పుడు అధికారం తన చేతిలో ఉండటంతో దళిత సంఘాలు పెద్ద ఎత్తున ఉద్యమించినప్పటికీ తాను వ్యవస్థలను మేనేజ్ చేసుకుని తప్పించుకోగలిగారు. కానీ అప్పుడు చేసిన పాపాలు ఇప్పుడు ఆయన వెంట పడ్డాయి. దేనికైనా సమయం వస్తుంది అని మరచిపోవద్దు. భగవంతుడు అవినీతిపరులకు తగిన సమయంలో తప్పక శిక్ష వేస్తాడు.

- షోడదాసి శ్యామూల్ రాజ్, కడప

చట్టం దృష్టిలో అందరూ సమానులే



చట్టం దృష్టిలో సామాన్యులైనా, ధనవంతులైనా అందరూ సమానులే. దర్యాప్తు సంస్థలు చంద్రబాబుపై అభియోగాలు మోపాయి. దాని ప్రకారమే అరెస్టు చేయడం జరిగింది. నిజానిజాలు కోర్టు ద్వారా బహిర్గతం అవుతాయి. ఎవరైనా సరే ఏ తప్పు లేనపుడు నిర్భయంగా బయటికి రావచ్చు.

- కె.చిన్నసుబ్బరాయుడు, తుమ్మలూరు, పెండ్లిమర్రి మండలం

ఆధారాలతోనే అరెస్టు..



తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును పక్కా ఆధారాలతోనే అరెస్టు చేశామని సీఐడీ అధికారులు సమాచారం ఇస్తున్నా.. రాజకీయ లబ్ధికోసం అల్లర్లకు పాల్పడటం సరికాదు. దర్యాప్తు సంస్థలకు సహకరించి తన నిజాయితీని నిరూపించుకోవాలి.

- నిప్పు నాగరాజు, కడప

అరెస్టు అక్రమం కాదు.. సక్రమమే!



చంద్రబాబు నాయుడు అరెస్టును అక్రమ అరెస్టు అని గగ్గోలు పెడుతున్న టీడీపీ నాయకులకు గతం గుర్తుకు రాలేదేమో. ఏకంగా కోట్ల రూపాయల ప్రజల సొమ్ముకు లెక్కాపద్దులు చూపకుండా గుటుక్కున మింగేస్తే అది చిన్న నేరమా? అన్ని ఆధారాలు దొరికినప్పుడు నిందితులను అరెస్టు చేయకుండా ఎలా ఉంటారు? ఇది అక్రమ అరెస్టు కాదు.. ముమ్మాటికి సక్రమమే. ఒకవేళ ఇందులో తన తప్పేమీ లేదు అని చంద్రబాబు భావిస్తే న్యాయస్థానాలకు అన్ని ఆధారాలు చూపించి బయటపడవచ్చు.

- డి.దేవరాజు, కడప

తిరుచ్చి వాహనంపై కడప రాయుడు



గ్రామోత్సవంలో స్వామి, అమ్మవార్లు

కడప కల్చరల్ : దేవునికడప శ్రీ లక్ష్మి వెంకటేశ్వర స్వామి ఆలయంలో శ్రావణమాసం చివరి శనివారం సందర్భంగా భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. తొలుత మూలమూర్తికి విశేష పూజలు నిర్వహించి ఆ ప్రాంగణంలో ఉత్సవమూర్తులను కొలువుదీర్చి పంచామృతాభిషేకం, ఇతర పరిమళ ద్రవ్యాలతో అభిషేకించి కనుల పండువగా అలంకరించారు. స్వామి, అమ్మవార్లను పల్లకీపై తిరుచ్చి వాహనంపై కొలువుదీర్చి గ్రామోత్సవం నిర్వహించారు. ఆలయ ఇన్‌స్పెక్టర్ ఈశ్వర్‌రెడ్డి పర్యవేక్షణలో అర్చకులు మయూరం కృష్ణమోహన్ గ్రామోత్సవంలో భక్తులకు హారతులు, తీర్థ ప్రసాదాలు అందజేశారు. గ్రామస్తులు స్వామిని మనసారా దర్శించుకుని పూజలు నిర్వహించారు.

ఆలయాలలో భక్తుల సందడి



విశేష అలంకారంలో శ్రీ పాలకొండ్రాయుడు

కడప కల్చరల్ : శ్రావణమాసం చివరి శనివారం భక్తులు తెల్లవారుజాము నుంచి ఆలయాలలో పూజల కోసం విశేష సంఖ్యలో హాజరయ్యారు. కడప నగరంలోని ప్రధాన ఆలయం తిరుమల-తిరుపతి దేవస్థానాల పరిధిలోని దేవునికడప శ్రీ లక్ష్మి వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఈ మాసంలో ఎప్పుడూ లేనంతమంది భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. నగరంలోని రామాలయాలు, శ్రీ ఆంజనేయస్వామి ఆలయాలలో కూడా శ్రావణమాసం చివరి శనివారం పూజలు ఘనంగా నిర్వహించారు. చిన్నచౌకు శ్రీ వీరాంజనేయస్వామి ఆలయంలో స్వామికి అర్చకులు విశేష పూజలు నిర్వహించారు. శ్రావణశనివారం కావడంతో విశేష సంఖ్యలో స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. అలాగే మున్సిపల్ మైదానం శ్రీ రాజరాజేశ్వరీదేవి ఆలయ ప్రాంగణంలో వీరాంజనేయస్వామికి పూజలు చేసి హనుమాన్ చాలీసా పఠింపజేశారు.

పాలకొండరాయునికి..

కడప నగర శివార్లలోని పాలకొండల్లో శ్రీ పాలకొండ్రాయస్వామికి విశేష అలంకారం, పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి, అమ్మవార్లకు విశేష అభిషేకాలు, పూలు, సువర్ణ ఆభరణాలతో కనుల పండువగా అలంకారం చేశారు. ప్రాతఃకాలంలో సుప్రభాతం, సహస్ర నామార్చన, అలంకారం అనంతరం సర్వదర్శనం కల్పించారు. ప్రధాన అర్చకులు యోగీశ్వరశర్మ ఆధ్వర్యంలో విశేష పూజలు చేశారు. ఈఓ శ్రీధర్ కార్యక్రమాలను పర్యవేక్షించారు.



పాలకొండలో భక్తుల సందడి

ఊడిపడిపోయిన రెయిలింగ్



పాలెంపల్లి సమీపంలో బ్రిడ్జి వద్ద ఊడిపడిపోయిన రెయిలింగ్

కడప కార్పొరేషన్ : కడప నగర శివార్లలో ఉన్న రింగ్ రోడ్డులో పాలెంపల్లి వద్ద బుగ్గవంకపై ఉన్న బ్రిడ్జికి వేసిన రెయిలింగ్ ఊడిపోయింది. వాహనాలు ఢీకొనడం వల్లే ఇది ఊడిపోయినట్లు తెలుస్తోంది. ఇది ఊడిపోయి రోడ్డుపై పడిపోయి వారాలు గడుస్తున్నా నేషనల్ హైవే అధికారులు దాన్ని బాగుచేయడంగానీ, లేదా పక్కన వేయడంగానీ చేయలేదు. ఫలితంగా మరో ప్రమాదం చోటుచేసుకునే అవకాశం ఉంది. ఇప్పటికైనా దానికి మరమ్మతులు చేయాలని పలువురు కోరుతున్నారు.

గుంత పూడ్చివేత



ప్రమాదకరంగా గుంత (నాడు)



గుంతను పూడ్చివేసిన దృశ్యం (నేడు)

కడప కార్పొరేషన్ : కడప నగరంలో మండీ బజార్‌కు పోయే మార్గంలో పైపులైన్ కోసం తీసిన గుంత ప్రమాదకరంగా మారింది.

ఇరవై రోజులైనా ఎవరూ పట్టించుకోకపోవడంతో 'గొయ్యి.. ప్రమాదమోయి' శీర్షికన ఈనెల 8వ తేది 'సాక్షి' వార్త ప్రచురించింది. దీనిపై స్పందించిన అధికారులు ఆ గొయ్యిని మట్టితో పూడ్చివేశారు.

వైభవంగా శ్రావణమాస పూజలు



పూజలందుకుంటున్న లక్ష్మీ చెన్నకేశవ స్వామి



పుష్పగిరిలో క్యూ లైన్‌లో భక్తులు

వల్లూరు: ప్రముఖ పుణ్యక్షేత్రమైన పుష్పగిరిలో శ్రావణ మాసం నాలుగో శనివారాన్ని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనివారం కొండ పై వెలసిన శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామిని అర్చకులు ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి భారీగా తరలి వచ్చిన భక్తులు పెన్నా నదిలో స్నానాలు ఆచరించి స్వామి వారిని, లక్ష్మీ దేవి అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. అలాగే మండల పరిధిలోని పలు గ్రామాలలో ఆంజనేయ స్వామి ఆలయాలలో పూజలను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు.

అంజన్న ఆలయాల్లో ప్రత్యేక పూజలు

పులివెందుల టౌన్ : శ్రావణ మాసోత్సవాలలో భాగంగా నాల్గవ శ్రావణ శనివారాన్ని పురస్కరించుకొని అంజన్న ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పట్టణంలోని తూర్పు ఆంజనేయ స్వామి, పడమటి వీరాంజనేయస్వామి, కోతి సమాధి ఆంజనేయస్వామి, పీడబ్ల్యూ కాలనీ ఆంజనేయస్వామి ఆలయాల్లో శ్రావణమాస చివరి శనివారం కావడంతో అంజన్నకు ఆకు పూజలు, తోమాల సేవా పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయాల్లో తాళాల భజన కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులకు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

వైభవంగా ఆంజనేయ స్వామి గ్రామోత్సవం

వీరపునాయునిపల్లె: శ్రావణమాసం చివరి శనివారం సందర్భంగా మండల కేంద్రమైన వీరపునాయునిపల్లెలో ఆంజనేయ స్వామి గ్రామోత్సవం వైభవంగా సాగింది. ఆలయ అర్చకుడు రాఘవేంద్ర శర్మ స్వామి ఉత్సవ విగ్రహాన్ని అత్యంత సుందరంగా అలంకరించి గ్రామోత్సవం నిర్వహించారు.

నేటి నుంచి స్వాతంత్ర్య పోరాట యోధుల చిత్రాల ప్రదర్శన

కడప వైఎస్‌ఆర్‌సర్కిల్ : భారతదేశ స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొని విశేష సేవలు అందించిన పోరాట యోధుల చిత్ర పటాల ప్రదర్శనను ప్రతి ఒక్కరూ తిలకించాలని పలువురు నగర ప్రముఖులు పిలుపునిచ్చారు.

కడప నగరంలోని వైఎస్సార్ మెమోరియల్ ప్రెస్ క్లబ్ లో శనివారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. 'ఆల్ ఇండియా మిల్లీ కౌన్సిల్ ఆధ్వర్యంలో భారత స్వాతంత్ర సమరయోధుల చిత్రపటాల ప్రదర్శనను ఏర్పాటు చేస్తున్నామన్నారు. కడప నగరంలోని నూరే జహా షాది ఖానాలో ఆది, సోమవారాల్లో రెండు రోజులపాటు 350 మంది స్వతంత్ర పోరాట యోధుల చిత్రపటాల ప్రదర్శన ఉంటుందన్నారు. ఈ ప్రదర్శనను డిప్యూటీ సీఎం అంజాద్ బాష, కడప నగర మేయర్ సురేష్ బాబు, జిల్లా కలెక్టర్ విజయరామరాజు, మున్సిపల్ కమిషనర్ సూర్య సాయి ప్రవీణ్ చంద్ ప్రారంభించనున్నారన్నారు. ఈ సమావేశంలో ప్రముఖ చరిత్రకారులు సయ్యద్ నశీర్ అహ్మద్, అమీన్ హాస్పిటల్ ఎండి నయీమ్ బాష, సిటీ లాడ్జ్ ఎండి షామీర్ బాష, ఆల్ ఇండియా మిల్లీ కౌన్సిల్ నాయకులు పాల్గొన్నారు.

అవార్డు గ్రహీతకు ఘన సన్మానం



హెచ్ఎం సాదిక్ ఆలీని సన్మానిస్తున ఉపాధ్యాయులు, పేరెంట్ కమిటీ సభ్యులు

కడప ఎడ్యుకేషన్ : జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డును అందుకున్న కడప బిస్మిల్లానగర్ నగర పాలక ఉర్దూ ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు షేక్ సాదిక్ ఆలీని శనివారం పాఠశాల ఉపాధ్యాయులు, పేరెంట్ కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. పాఠశాల కమిటీ చైర్మన్ సుల్తాన మాట్లాడుతూ సాధిక్ ఆలీకి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు రావడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కమిటి సభ్యులు, ఉపాధ్యాయులు, తల్లితండ్రులు పాల్గొన్నారు.

శివరామానంద సరస్వతిని సన్మానించిన ఆర్యవైశ్యులు



శివరామానంద సరస్వతిని సన్మానిస్తున్న ఆర్యవైశ్యులు

పోరుమామిళ్ల : పట్టణంలో శ్రీ వాసవీకన్యకాపరమేశ్వరిదేవి ఆలయాన్ని పునఃనిర్మించి ఏడేళ్లు కావడంతో శనివారం సప్తమ వార్షికోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా సన్యాసం స్వీకరించిన మాజీ ఎమ్మెల్యే శివరామానంద సరస్వతిని ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు గాజులపల్లె శ్రీనివాసులు, మహిళా మండలి అధ్యక్షురాలు కాకుమాని కృష్ణవేణి ఆధ్వర్యంలో ఆర్యవైశ్యులు శాలువా, పూలదండతో ఘనంగా సన్మానించారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు



ప్రజలకు ప్రభుత్వ పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డి



సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

గడప గడపకు మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డి

కమలాపురం: సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం అర్హులందరికి సంక్షేమ పథకాలు అందిస్తోందని ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డి తెలిపారు. శనివారం కోగటం, కంచన్నగారిపల్లె, చెన్నపురెడ్డిపల్లె గ్రామాల్లో మాజీ సర్పంచ్ కరుణ్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి సీకే దిన్నె జెడ్పీటీసీ నరేన్ రామాంజులరెడ్డితో కలసి ఆయన హాజరయ్యారు. గడప గడపకు తిరిగి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. ప్రజల నుంచి రేషన్ కార్డు, సీసీ రోడ్లు, ఇంటి స్థలాలు, పక్కా గృహాలు, విద్యుత్ స్తంబాలు కావాలని వినతులు అందడంతో అక్కడే ఉన్న అధికారుల దృష్టికి తీసుకెళ్లి వాటిని పరిష్కరించాలని ఆదేశించారు.అర్హులుగా ఉన్నప్పటికి ఎవరికైనా సంక్షేమ పథకాలు అందకుండా ఉంటే వారిని గుర్తించి పథకాలు అందించడమే జగనన్న ప్రభుత్వ లక్ష్యం అన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు సంబటూరు ప్రసాద్‌రెడ్డి, ఉత్తమారెడ్డి, సుమిత్రా రాజశేఖర్ రెడ్డి, ఎన్‌సీ పుల్లారెడ్డి, సాదిక్, మారుజోళ్ల శ్రీనివాసరెడ్డి, కొండారెడ్డి, ఆర్‌వీఎస్ఆర్, సత్యంరెడ్డి, క్రిష్టారెడ్డి, లక్ష్మీనారాయణరెడ్డి, జగన్‌మోహన్ రెడ్డి, మస్తానయ్య, నిఖిల్‌రెడ్డి, స్థానిక నాయకులు సిద్దారెడ్డి, ఆంజనేయులు, నారాయణ, సుబ్బయ్య, అధికారులు పాల్గొన్నారు.

సచివాలయ వ్యవస్థతో గ్రామ స్వరాజ్యం

వీరపునాయునిపల్లె: సచివాలయ వ్యవస్థతోనే గ్రామ స్వరాజ్యం సాధ్యమవుతుందని కమలాపురం ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి అన్నారు. శనివారం వీరపునాయునిపల్లె మండలంలోని ఇందుకూరు పంచాయతీ పరిధిలోని అయ్యవారిపల్లెలో 40 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించిన సచివాలయ భవనాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రజల సమస్యలను గ్రామ స్థాయిలో పరిష్కరించేందుకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి గ్రామ సచివాలయ వ్యవస్థ ఏర్పాటు చేశారన్నారు. అంతే కాకుండా అన్ని శాఖలకు సంబంధించిన అధికారులను నియమించడంతో పాటు ప్రభుత్వం చేపట్టబో యే సంక్షేమ పథకాలు ప్రజలకు తెలియజేయడం , ఆ పథకాలకు అర్హులను గుర్తించి వాటిని వారికి అందించేందుకు ప్రతి 50కుటుంబాలకు ఒక్కో వలంటీర్‌ను నియమించారన్నారు. ఏపీపీఎస్సీ బోర్డు మెంబరు నిమ్మకాయల సుధాకర్‌రెడ్డి, రాష్ట్ర మైనింగ్ డైరెక్టర్ వీరప్రతాప్‌రెడ్డి, సివిల్ సప్లై డైరెక్టర్ గోపాల్‌రెడ్డి, మండల అధ్యక్షుడు రఘునాథరెడ్డి, రమేష్‌రెడ్డి, విశ్వనాథ్ రెడ్డి, ప్రకాష్‌రెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణ పనులు పూర్తి చేయాలి

వీరపునాయునిపల్లె: మండలంలోని సంగాలపల్లె గ్రామం వద్ద వేంపల్లె, యర్రగుంట్ల ప్రధాన రహదారిలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీ సప్తగిరి లక్ష్మి వెంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డి అన్నారు. శనివారం ఆయన ఆలయ నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాన రహదారిలో వెంకటేశ్వర స్వామి ఆలయం నిర్మించాలని సంకల్పించడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఆలయ నిర్మాణం కోసం అహర్నిశలు కృషి చేసిన నారాయణరెడ్డిని ఎమ్మెల్యే అభినందించారు. మండల అధ్యక్షుడు రఘునాథరెడ్డి మాట్లాడుతూ త్వరలో పనులు ప్రారంభిస్తామన్నారు.